నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | మార్చి 27, 2025 | www.navatelangana.com

ఉట్నూర్‌లో చైన్ స్నాచింగ్ కలకలం



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. బుధవారం కోర్టు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఐసీడీఎస్ సూపర్వైజర్ ఆత్రం ఉమాను కోర్టు ఆవరణంలో పోలీసులు పిలుస్తున్నారని మాయమాటలు చెప్పి రెండు తులాల బంగారం గొలుసును దొంగలించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హత్య కేసులో ఓ వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ బుధవారం తీర్పు చెప్పారు. లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం..2022, ఆగస్టు 21న జైనథ్ మండలం రాంపూర్-టిలో కొడిమెల ప్రభాకర్ పాత కక్షలు మనసులో ఉంచుకొని ఉట్ల రమేష్‌ను విచక్షణారహితంగా కత్తితో పొడిచి, కొట్టి చంపేశాడు. అప్పటి జైనథ్ ఎస్సై బి.పెర్సిస్ కేసు నమోదు చేయగా, సిఐకే నరేష్‌కుమార్ సాక్షులను విచారించి నేరస్తునిపై చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో విచారణలో కోర్టులైజర్ అధికారి ఎం.గంగాసింగ్, కోర్టు డ్యూటీ అధికారి ఎంఏ జమీర్ 18 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మధుకర్ విచారించి నిందితునిపై నేరం రుజువు చేశారు. న్యాయమూర్తి నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. నేరస్తునికి శిక్ష పడడంలో ప్రతిభ కనబరిచిన కోర్టు డ్యూటీ అధికారిని, లైజన్ అధికారిని, పీపీని ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

ఉధృతమవుతున్న సీసీఐ పోరాటం..!

- మూడేండ్లుగా పోరాడుతున్న సాధన కమిటీ
- పునఃప్రారంభం కోసం రిలే నిరాహార దీక్షలు
- రేపు జిల్లాకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాక
- ఏప్రిల్ 2న ఢిల్లీలో ధర్నాకు సిద్ధమవుతున్న నాయకులు

ఆదిలాబాద్‌లో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పునఃప్రారంభం కోసం పోరాటం ఉధృతమవుతోంది. మూడేండ్ల నుంచి సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో పోరాటం సాగిస్తుండగా.. తాజాగా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. ఈ నెల 19న ప్రారంభమైన ఈ దీక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ దీక్షలకు రాజకీయ, ప్రజా సంఘాలతో పాటు యువత, ప్రజలు పెద్ద ఎత్తున సంఘీభావం తెలుపుతున్నారు. మరోపక్క ఈ నెల 28న శుక్రవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించనున్నారు. రాష్ట్ర కార్యదర్శి పదవి చేపట్టిన తర్వాత తొలిసారి జిల్లాకు రానుండటంతో ఆ పార్టీ శ్రేణులతో పాటు సాధన కమిటీ నాయకులు సభను జయప్రదం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఏప్రిల్ 2న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా అక్కడి జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారు.


కొనసాగుతున్న రిలే దీక్షలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న మూతపడిన సీసీఐ పరిశ్రమను తెరిపించాలని ఇక్కడి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు జిల్లావాసులు అందరూ డిమాండ్ చేస్తున్నారు. 1969లో ఈ పరిశ్రమ మంజూరు కాగా 1984లో ఉత్పత్తి ప్రారంభమైంది. కాగా 1989 వరకు లాభాల్లోనే నడిచింది. 1991లో ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల మేరకు ఈ పరిశ్రమ నుంచి లెవీ సిమెంట్ కొనుగోలును రద్దు చేసింది. ఆర్థిక ప్రోత్సాహకాలను సైతం నిలిపివేసింది. దీంతో 2002లో ఈ యూనిట్‌ను మూసి వేయాలని సీసీఐ నిర్ణయించింది. సుమారు ఆరేండ్ల పాటు నెట్టుకొచ్చిన ఈ సంస్థ 2008లో ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసింది. జిల్లాలో ఉన్న ఒక్కగానొక్క పరిశ్రమ మూతపడటంతో కార్మికులకు ఉపాధి దూరం కాగా.. జిల్లావాసులకు తీవ్ర నిరాశను కలిగించింది. అప్పటి నుంచి వివిధ రూపాల్లో ఉద్యమాలు సాగుతూనే ఉన్నాయి. 2018 ఎన్నికల సమయంలో జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర హోమంత్రి అమిత్‌షా బీజేపీని గెలిపిస్తే సీసీఐ పరిశ్రమను తెరిపిస్తామని హామీనిచ్చారు. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చకపోగా.. ఈ పరిశ్రమలో ఉన్న పరికరాలను తుక్కుకింద విక్రయించడానికి టెండర్లు పిలిచింది. ప్రస్తుతం కోర్టులో కేసు ఉన్నందున ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.

మూడేండ్ల నుంచి ఉధృతం..!

సీసీఐ పరిశ్రమను పునఃప్రారంభించాలని మూడేండ్ల నుంచి పోరాటం ఉధృతమవుతోంది. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలతో సీసీఐ సాధన కమిటీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వివిధ రూపాల్లో నిరసనలు చేపడుతున్నారు. పట్టణ బంద్ చేపట్టడంతో పాటు జాతీయ రహదారి దిగ్బంధనం, బైక్ ర్యాలీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్‌చౌక్‌లో 34రోజుల పాటు రిలే నిరవధిక దీక్షలు చేపట్టారు. అనంతరం అప్పటి రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి విన్నవించడంతో పాటు వివిధ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు సైతం వినతిపత్రాలు అందించి ఈ పరిశ్రమను తెరిపించాలని కోరారు.

రేపు జాన్‌వెస్లీ రాక..!

సీసీఐ పరిశ్రమను పునఃప్రారంభించాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ నెల 19న మొదలుపెట్టిన ఈ దీక్షలు గురువారంతో ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంలో భాగంగా ఈ నెల 28న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ జిల్లాకు రానున్నారు. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న దీక్ష శిభిరాన్ని సందర్శించడంతో పాటు పరిశ్రమను పరిశీలించనున్నారు. అనంతరం భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసి ఈ పరిశ్రమ ఏర్పాటు ఆకాంక్షను బలంగా వినిపించాలని నిర్ణయించారు. సాధన కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఏప్రిల్ 2న ఢిల్లీలోనూ పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాలని భావిస్తున్నారు.


మూతబడిన సీసీఐ

జయప్రదం చేయాలి : దర్శనాల మల్లేష్, సీసీఐ సాధన కమిటీ కన్వీనర్



సీసీఐ పరిశ్రమను పునఃప్రారంభించాలనే డిమాండ్‌తో అనేక ఏండ్లుగా పోరాడుతున్నాం. ఈ పరిశ్రమ తెరిపిస్తే అనేక మంది పేదలకు జీవనోపాధి లభిస్తుంది. ఎన్నికల్లో గెలిపిస్తే సీసీఐని తెరిపిస్తామని బీజేపీ హామీనిచ్చి మాట తప్పింది. పోరాటాన్ని ఉధృతం చేయడం ద్వారా పరిశ్రమను సాధించేందుకు అవకాశం ఉంటుంది. రేపు జిల్లాకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రానున్న దృష్ట్యా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి.



ఉద్యమం మరింత ఉధృతం : విజ్జగిరి నారాయణ, సీసీఐ సాధన కమిటీ కో కన్వీనర్

సీసీఐ పరిశ్రమను తెరిపిస్తామని బీజేపీ మాట ఇచ్చి మరిచిపోయింది. ఇప్పుడు తుక్కు కింద విక్రయించాలని నిర్ణయించింది. ఈ పరిశ్రమను పునఃప్రారంభించాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టాం. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్రం నిర్ణయం తీసుకోవాలి. లేదంటే రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.

నకిలీ పత్తి విత్తనాలపై పటిష్ట నిఘా

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయం, కొనుగోలుపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై ఏర్పాటు చేసిన సమావేశానికి డిసిపి ఎ.భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల వినియోగం వలన కలిగే నష్టాలను రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే దళారులు, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాలు, గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనేలా రైతులకు వివరించాలని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలతో పట్టాదారు, కౌలు రైతులు పంట సాగు చేసినట్లయితే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు నిలిపేస్తామని, దళారులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో దళారులు ఎవరైనా విడిగా పత్తి విత్తనాలు విక్రయించినట్లయితే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. హెచ్‌టి కాటన్ సాగు చేసిన రైతులు గ్లైఫోసెట్ కలుపు మందు పిచికారి చేయడం ద్వారా భూసారం తగ్గుతుందని, క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించాలని, బస్టాండ్, రైల్వేస్టేషన్, జిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. దళారులు ఇతర రాష్ట్రాల నుండి నకిలీ విత్తనాలను తీసుకొచ్చి మోసానికి పాల్పడుతున్నారని, రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేసి అధిక లాభాలు పొందాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, ఏడీఏలు, ఎస్ఐలు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించి మాఫీ పొందాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2024-2025 సంవత్సరం వరకు చెల్లించవలసిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని కేవలం 10శాతం వడ్డీతో ఏకకాలంలో పూర్తిగా చెల్లించి, వడ్డీపై 90శాతం మాఫీ పొందాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. ఈ సదవకాశాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకొని పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. బుధవారం పట్టణంలో అవగాహన కల్పిస్తూ పన్ను చెల్లించిన వారికి రశీదు అందజేశారు. పన్నులను బిల్ కలెక్టర్ ద్వారా, మున్సిపల్ ఆఫీస్ కౌంటర్‌లో లేదా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని, దీనికి ఈ నెల31 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్వో కళ్యాణ్, ఆర్ఐ శివప్రసాద్, వెంకటేష్ ఉన్నారు.


ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షునిగా భీమన్న

నవతెలంగాణ-ఉట్నూర్



ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులుగా గురిపెల్లి భీమన్న నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు గంజి రాజన్న బుధవారం నియామక పత్రాలు జారీ చేశారు. ఈ సందర్భంగా భీమన్న మాట్లాడుతూ ఆదివాసీ నాయక్‌పోడ్ సమస్యలపై పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసం బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.సంగీత అధ్యక్షత వహించగా ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సాయిప్రసాద్ పాల్గొని విలీన ద్రవణాలు కణధారధర్మాలు అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో విభాగం అధిపతి డాక్టర్ జగ్రామ్, అధ్యాపకులు మంజుల, జోత్స్న, రఫీ, రమాకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి, వేదికపై అదనపు కలెక్టర్ తదితరులు

నవతెలంగాణ-నస్పూర్

మహిళలు వారికి ఉన్న హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. బుధవారం నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో భేటి బచావో- భేటి పడావో, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మెంటల్ హెల్త్ అండ్ లీగల్ రైట్స్ అవగాహన కార్యక్రమనికి జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డా.అనితతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు తమకున్న హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. స్మార్ట్ ఫోన్ వాడకం పెరగడంతో మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని, ఎక్కువ సమయాన్ని వృథా చేస్తూ సమస్య ఎదురైనప్పుడు ఎవరికి చెప్పుకోకుండా మానసిక ఒత్తిడి గురై తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటూ చాలా మంది జీవితాలు కోల్పోతున్నారని అన్నారు. స్మార్ట్ ఫోన్ వాడకం తగ్గించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, యోగా, వ్యాయామం వంటివి అలవాటు చేసుకోవాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురైనప్పుడు సాయం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్ 14416ను సంప్రదించాలని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు, లోకల్ కంప్లయింట్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళా ఉద్యోగులు భద్రత కలిగిన వాతావరణంలో పని చేసే విధంగా చట్టాలు తోడ్పడతాయని తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళల కోసం మానసిక సమస్యలు, న్యాయ హక్కులకు సంబంధించి మెంటల్ హెల్త్ అండ్ లీగల్ రైట్స్ వంటి కార్యక్రమం నిర్వహించడం చాలా మంచి విషయమన్నారు. మానసిక ఒత్తిడి, ఉపశమనాలకు సంబంధించి ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను సద్వినియోగం చేసుకోవాలని, చట్టాలపై పెంపొందించుకున్న అవగాహనను మరింత మందికి తెలియజేయాలని పేర్కొన్నారు. మానసిక వైద్య నిపుణులు డా.సునీల్ మహిళలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఓఎన్‌సిడి డా.ప్రసాద్, మోటివేషనల్ స్పీకర్ మధుకర్, సీడీపీఓలు, సూపర్వైజర్లు, వైద్యాధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆర్‌పిలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

అడెల్లి ఆలయానికి రూ.36.46లక్షల ఆదాయం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. ఈ లెక్కింపులో రూ.36లక్షల46వేల ఆదాయంతో పాటు మిశ్రమ బంగారం 210 గ్రాములు, వెండి 4 కిలోల700 గ్రాములు వచ్చినట్లు ఈవో రమేష్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపుకు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగు కిషన్‌గౌడ్ పర్యవేక్షకులుగా ఉన్నారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నమూనా ఇందిరమ్మ ఇండ్లు పటిష్టంగా నిర్మించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ- ఖానాపూర్

నమూనా ఇందిరమ్మ ఇండ్లను పటిష్టంగా నిర్మించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ సందర్శించారు. నిర్మాణ పనులను పరిశీలించారు. హౌస్ డిజైన్, ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ నాణ్యతను మెరుగుపరచాలని, పనులను వేగంగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఇండ్లు లేని పేదవారికి ఇండ్లను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల సర్వే కొనసాగుతోందని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ పట్టణ పరిధిలో ఆస్తిపన్ను వసూలు వందశాతం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌కు ఈ నెల 31 వరకు గడవు ఉన్నందున దస్తుదారులు 25 శాతం లబ్ధి పొందేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వాగులు, నది పరివాహక ప్రాంతాలలో ఇసుక రీచ్‌లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పీడీ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలి

నవతెలంగాణ-కడెం



మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ మెడపట్ల నితిన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాయ్స్ హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ నియమించాలన్నారు. సంవత్సరం నుండి ఆశ్రమ పాఠశాలకు వార్డెన్ ఇన్‌చార్జిగా నియమించి కాలం వెల్లదీస్తున్న పరిస్థితి ఉందన్నారు. వెంటనే రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని, ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ హాస్టల్ తాత్కాలికంగా కొనసాగిస్తున్న ఎస్సీ హాస్టల్ కోసం సొంత భవనం నిర్మించి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలి

నవతెలంగాణ-నేరడిగొండ



గ్రామాల్లో తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంటాల, చిన్న బుగ్గారం, నాగ మల్యాల, పిచార గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో పర్యటిస్తూ తాగునీటితో పాటు ఇతర సమస్యల తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు గ్రామాలకు చేరుతుందా లేద అని పరిశీలించారు. నీటి కొరత ఉన్న గ్రామాల్లో ఇబ్బంది రాకుండా ట్యాంకర్ల ద్వారా అందించాలని పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశించారు. ఇందులో ఏఓ కృష్ణవేణి, ఎంపీఓ లక్ష్మణ్, పంచాయతీ సెక్రెటరీ రవికిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తాగునీటి సమస్యపై పంచాయతి కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశమందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భజలాలు అడుగంగుతున్న ప్రస్తుతం నీటి ఎద్దడిపై దృష్టి సారించాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగు నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ మోడల్ గ్రామంపై దృష్టి సారించాలని, ఈజీఎస్ ద్వారా పంచాయతీలో నిర్వహిస్తున్న నర్సరీ మొక్కలు వాడి పోకుండా రెండు పూటల నీటిని అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ. జీవన్ రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ జాదవ్ శ్రీనివాస్, సెక్రటరీలు ముండే రమేష్, ప్రవీణ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషిచేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీపీయు సిబ్బంది ప్రేమ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కేఆర్‌కే మక్కా మసీద్ లో షుర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ కే.వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ కిరణ్‌తో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్ మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం ఒక వ్యవస్థానే పని చేస్తుందన్నారు. వారికి కోసం ప్రత్యేకంగా జేజేబీ కోర్టు, చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, ఎన్జీఓలు పనిచేస్తున్నాచని తెలిపారు. ఆపదలో ఉన్నవారు ఎవరికి భయపడకుండా డయల్ 100, 181, 1098కి కాల్ చేయాలన్నారు. బాలిక హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అనంతరం బాల్య వివాహన నిర్మూలనకై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు షుర్ ఎన్జీఓ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ అజర్ అలీ, ప్రధానకార్యదర్శి అబ్దుల్ రషీద్, కోశాధికారి తౌఫీక్,మౌలానా ఫిరోజ్, ఇమామ్ సాహబ్, హాఫీజ్ సయ్యద్ జుబైర్, మౌజాన్ సాహబ్ షేక్ అఫ్ఫాన్, షేక్ ఆరిఫ్, డాక్టర్ ఫరీద్ ఉన్నారు.

గిరిపోషణ్ అవార్డుకు డిప్యూటి డీఎంహెచ్ ఎంపిక

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



కేంద్ర ప్రభుత్వం అందించే గిరిపోషణ అవార్డుకు డిప్యూటి డీఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్ ఎంపికయ్యారు. కాగా బుధవారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించిన సందర్భంగా వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిపోషణ అభియాన్ కింద ఉమ్మడి జిల్లాలో వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న సుమారు 15 వేల విద్యార్థులను స్క్రీనింగ్ పరీక్షలు చేశామన్నారు. ప్రతి మండలంలో ప్రత్యేకాధికారులను నియమించి ఐరన్, విటమిన్ టాబ్లెట్లను అందించామన్నారు. ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఒక్క విద్యార్థికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, వైద్యం అందించామన్నారు. కేవలం నాలుగు నెల లోపునే రక్త హీనత ఉన్న వారికి ఇప్పపువ్వు లడ్డు (మొహ్వా లడ్డు)లను అందించి సాధరణ స్థితికి తీసుకువచ్చామని పేర్కొన్నారు. కృషిని గుర్తించిన ప్రభుత్వం ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తాతో పాటు తనకు ఈ అవార్డును ఈ నెల 29న దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రధానం చేయనుందని తెలిపారు. అవార్డులతో బాధ్యతలు మరింత పెరుగతాయన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

జిల్లాలోని వెనుకబడిన తరగతులు ఈబీసీ, ఆర్థికంగా బలహీన వర్గాల ఈడబ్ల్యూఎస్‌కు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాసం పథకాన్ని సంబంధించి ధరఖస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారులు వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించకూడదన్నారు. వీటితో పాటు రేషన్ కార్డ్, ఆదాయ, కుల ధృవీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాల కోసం), పట్టాదార్ పాస్ బుక్ (వ్యవసాయ పథకాల కోసం), పాస్ ఫోటో సైజ్ ఫోటోస్ ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

నవతెలంగాణ-నేరడిగొండ

కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిలుకూరి నరేందర్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు గంగాధర్ చేరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు వేసి బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గజేందర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి వలస వస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతన్న, అమృత్‌రావ్ పాటిల్, చట్లపల్లి అనిల్, పాల శంకర్, నాయుడు రవి సద్దాం, విద్యాసాగర్ రెడ్డి, శివాజీ ఉన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

నవతెలంగాణ-కడెం

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి జీఓ నంబర్ 51ని సవరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గ్రామ పంచాయితీ కార్మికులకు మూడు నెలల వేతనాల చెల్లింపుల్లో జరుగుతున్న నిర్లక్ష్యం, జాప్యంపైన చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయితీల్లో సుమారు 60,000 మంది గ్రామ పంచాయితీ ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారన్నారు. గ్రామాలలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె పకృతి వనాలు, వైకుంఠధామాలు, డ్రైవర్లు, ఆఫీసు నిర్వహణ తదితర పనుల్లో వివిధ కేటగిరీల వారీగా కార్మికులు పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. గతంలో అనేక ఆందోళన పోరాటాలు చేసిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 2024 డిసెంబర్ 19న పంచాయతీ కార్మికుల బకాయి వేతనాల చెల్లింపుకు రూ.149 కోట్ల కేటాయించిందని గుర్తు చేశారు. ఈ మొత్తాన్ని కార్మికుల బకాయి వేతనాలకు మాత్రమే ఖర్చు చేయాలని, ఏ ఇతర ఖర్చులకు మళ్ళించొద్దన్నారు. ఇచ్చిన చెక్కులు ఎస్టీఓల్లో జమ చేయగా మూడు నెలలు గడుస్తున్న నిధులకు మోక్షం కలగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయి వేతనాలకు నిధులు ఇచ్చిన కుడి చేతితో ఇచ్చి ఎడమ చేతితో నోటికాడి ముద్దను లాక్కున్నట్లుగా ట్రెజరీలో వేసిన చెక్కులకు ఆర్థిక శాఖ డబ్బును కేటాయించకుండా నిధులను ఇతర పథకాలకు మళ్ళించడంతో మూడు నెలల బకాయి వేతనాలు రాలేదన్నారు. వేతనాలు రాక కుటుంబాల పోషణ భారమై అప్పులపాలై పస్తులుంటూ పంచాయతీ కార్మికులు పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పంచాయితీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీఓ నెం. 51ని సవరణ, మల్టీపర్పస్ విధానం రద్దు, ట్రెజరీలలో నిలిచిన 6 నెలల బకాయి వేతనాలకు నిధులు విడుదల ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాల్సిఇ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు లక్ష్మణ్, రాములు నర్సయ్య, రాజమౌళి, ముసలింగం, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

రికార్డు ధర పలికిన మామిడి తోట వేలంపాట

నవతెలంగాణ-ఉట్నూర్



పండ్ల తోటలో అధికారులతో ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా

ఐటీడీఏ పరిధిలోని ఉట్నూర్ ఉద్యాన నర్సరీలో మామిడి తోట బహిరంగ వేలంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు ధర పలికింది. ఉద్యాన నర్సరీలో ఉన్న 350 మామిడి చెట్లకు బుధవారం ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అధ్యక్షతన జరిగిన వేలంపాట జరిగింది. ఇందులో రూ.10,05,000 న్యాను పలికి తోటను సొంతం చేసుకున్నారు. కాగా ఈ వేలం పాటలో ఉట్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, జైనూర్, ఆదిలాబాద్ ప్రాంతాల నుండి 17 మంది వ్యాపారస్తులు పాల్గొన్నారు. 2021లో అత్యధికంగా రూ. 4,66,000 వచ్చినట్లు పీఓ తెలిపారు. ఐటీడీఏ చరిత్రలో ఇంత ఆదాయం బహిరంగ వేలంలో మొదటిసారి వచ్చిందన్నారు. ఈ సంవత్సరం మంచి పంట వచ్చిందని, దీని వెనక రెండు సంవత్సరాలుగా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి సందీప్ కుమార్, ఉద్యాన విభాగ సిబ్బంది కృషి ఉన్నదన్నారు. సరైన సమయంలో ఎరువులు, నీళ్ల అందించటంతో పాటు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు తోటను దక్కించుకున్న వ్యక్తికి ప్రాజెక్ట్ అధికారి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ వేలంపాటలో కమిటీ సభ్యులు, గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ, పరిపాలన అధికారి దామోదర్ స్వామి, ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, ఉద్యాన విభాగ సిబ్బంది జయరాజు, అర్షిత, సాయి రాజ్, పూజ, రమేష్ పాల్గొన్నారు.

నీటి సమస్యను తీర్చాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు బుధవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో 30 సంవత్సరాల నుండి ఎప్పుడు లేని విధంగా నీటి ఎద్దడి కొనసాగుతుందన్నారు. అదేవిధంగా మరో రెండు నెలల్లో అతి తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నందున దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు. అదేవిధంగా లాండసాంగి వద్ద రెండు చెక్ డ్యాంలు, మావల వాటర్ వద్ద మట్టి పూడికతీత, పట్టణంలో మరో 10 వాటర్ ట్యాంకర్లు కొనుగోలు చేయాలని కోరారు. కాలనీల్లో ఉన్న ప్రతి వాటర్ ట్యాంకు వద్ద మరో పెద్ద బోర్లు వేసి వాటి నీటిని ట్యాంకు ఎక్కించాలని, నీటి సమస్యను తీర్చాలని విన్నవించారు. నిర్మల్ నుండి వచ్చే మిషన్ భగీరథ నీరు కూడా నిరంతరంగా వచ్చేటట్లు చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఇరిగేషన్ అధికారులకు వెంటనే ఎస్టిమేషన్ చెక్ డ్యాంలకు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ కమిషనర్ కూడా వెంటనే బోర్లు, మరో ఐదు ట్యాంకర్లు మున్సిపల్ ద్వారా కొనుగోలు చేసి అరేంజ్ చేయాలని తెలిపినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించినందుకు వారు ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో జహీర్ రంజాని, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, ఆవుల వెంకన్న, దర్శనాల లక్ష్మణ్, ఇజ్జగిరి సంజయ్ పాల్గొన్నారు.

8వ రోజు సీసీఐ దీక్షలో అంగన్‌వాడీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణకు సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నాటికి ఈ దీక్షలు 8వ రోజుకు చేరుకోగా అంగన్‌వాడీ మహిళలు కూర్చోగా వారికి సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్, కోకన్వీనర్ విజ్జగిరి నారాయణ, కస్తాల అరుణ్ కుమార్, లోకారి పోశెట్టి, బొల్లు ఈశ్వర్ దాస్, జగన్ సింగ్ పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుక్కు కింద అమ్మి వేసే ఈ టెండర్ ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రానున్న పార్లమెంట్ సమావేశంలో బడ్జెట్‌ను సవరించి సీసీఐ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశ్రమ కోసం నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రతో ఆదిలాబాద్ ప్రజల పొట్ట కొడుతున్నన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సునీత, లక్ష్మి, కళావతి, స్వరూప, అనసూయ, సుజాత, జ్యోతి, పద్మ, నిర్మల, ప్రభావతి, పార్వతి బాయి, నర్సమ్మ, రుక్మిణి, మల్లీశ్వరి, సునీత, శశికల, విశాఖ, వనిత, వందన కమిటీ సభ్యులు పందిరి భూమన్న, అలోక్ కుమార్, రాజు, కపిల్, తాటి లక్ష్మణ్, ఆకాష్, గోవిందు, సుభాష్, వామన్, అశోక్ స్వామి, బండి దత్త్రాతి, మోహన్, ఆశన్న, అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

90 శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై 90 శాతం బకాయి వడ్డీని మాఫీ చేసే అవకాశాన్ని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం పన్నుతో పాటు వడ్డీ 10 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈనెల 31 వరకు ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వసతి గృహాన్ని సందర్శించిన ఆమ్ ఆద్మీ పార్టీ

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహాన్ని బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ వార్డెన్‌ను పిల్లలకు మంచి నాణ్యమైన ఆహారం అందించాలని, వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఏఎన్ఎంల ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఇందులో సీహెచ్ వినోద్ కుమార్ ఉన్నారు.



విద్యార్థులకు అసౌకర్యం కల్గకుండా చూడాలి

- జిల్లా విద్యాశాఖాధికారి పి.రామారావు

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రామారావు అన్నారు. బుధవారం పలు పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించి వసతుల గురించి తెలుసుకున్నారు. గణిత పరీక్షలో రెగ్యులర్ విద్యార్థులు 9129కు గాను 9115 మంది హాజరయ్యారని, 14 మంది గైర్హాజరు అయ్యారని, ప్రయివేట్‌గా రాసిన ఇద్దరిలో ఒకరు హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే ముధోల్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ ఆష్టా ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని, గదులను పరిశీలించి సిఎస్, డిఓలకు పలు సూచనలు చేశారు. రెండు గదులలో వేసిన ఫర్నిచర్‌ను విద్యార్థులకు సౌకర్యంగా ఉన్నాయని వాటిని మార్చాలని ముఖ్య పర్యవేక్షకులు వట్టిమల్ల ప్రభాకర్‌కు సూచించారు. కాపీయింగ్ జరుగకుండా అందరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ నుండి సరియైన సెట్ ప్రశ్నాపత్రాలను తీసుకోవాలని, అదేవిధంగా జాగ్రత్తగా జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్‌లో పోస్ట్ చేయాలన్నారు. ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో విద్యాశాఖ సమన్వయ కర్త లింబాద్రి, ముఖ్య పర్యవేక్షకులు, శాఖాధికారి పాల్గొన్నారు.

ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పుత్లిబౌలి ఉర్దూ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు సమ్ము, రహీం, అఫ్సర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిని, సోదరభావాన్ని సూచించే రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ముబారక్, ముర్తుజా, నాయకులు ఇర్ఫాన్, ఫిరోజ్, వాసిం రంజానీ, కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షులు వసీమొద్దీన్ పాల్గొన్నారు.

ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

నిర్మల్ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పండరి బుధవారం ఆర్డీఓ రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారుకి పూల మొక్క అందజేశారు. తనతో పాటు అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి టీవీ.రమణ పాల్గొన్నారు.

కబ్జా భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని శివారులో 57 సర్వే నెంబర్‌లో గల రెండు ఎకరాల భూమి కబ్జాకు గురైందని, దాన్ని ప్రభుత్వ ఆధీనంలో తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమం పరిషత్ మండల నాయకులు ఆర్కా గోవింద్ రావ్ అన్నారు. బుధవారం ఆదివాసీ నాయకులతో కలిసి తహసీల్దార్ రాజలింగంను వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్మశాన వాటికకు రెండు ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. కానీ స్మశాన వాటికను పది గుంటలో ఏర్పాటు చేసి 1.30 ఎకరాల భూమిని కొంత మంది స్థానికులు కబ్జా చేసి పంటను వేసి సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని వెంటనే ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. ఇందులో ఆదివాసీ సంక్షేమం పరిషత్ నాయకులు పుసం దేవ్‌రావ్, కినక భీంరావ్ ఉన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు రీతిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బీహార్ రాష్ట్రంలోని గాయ జిల్లాలో ఈనెల 27 నుంచి 30 తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డి టోర్నీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టుకు ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారిని జాబడే రీతిక ఎంపికైంది. జాతీయస్థాయి టోర్నీకు జిల్లా క్రీడాకారిణి ఎంపిక కావడంతో జిల్లా కబడ్డి అసోసియేషన్ చీఫ్ పాటర్న్ గోడం నగేష్ చైర్మన్ పాయల శంకర్, అధ్యక్షులు ఉష్కం రఘుపతి, ప్రధాన కార్యదర్శి జబడే రాష్ట్రపాల్, కబడి అసోసియేషన్ సంఘ బాధ్యులు సీనియర్ క్రీడాకారులు అభినందించారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | మార్చి 27, 2025 | www.navatelangana.com

పది విద్యార్థులకు జ్యూస్ పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సై కొమురయ్య, పీఈటీ తిరుపతి జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం, పరీక్ష సమయం నేపథ్యంలో విద్యార్థులకు జ్యూస్ పంపిణీ చేశామని, దీంతో వారికి ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని ప్రధాన ప్రయాణ ప్రాంగణాలైనా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లోని బస్టాండ్లలో మౌలిక వసతులు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. డిపో మేనేజర్ రాజశేఖర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో అరకొర సౌకర్యాలు ఉన్నాయని, మహిళలకు పబ్లిక్ టాయిలెట్స్ సరిగ్గా లేవన్నారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం లేదని, ఫ్యాన్స్ పనిచేయడం లేదని, పార్కింగ్ స్థలం సరి పోవడం లేదన్నారు. ప్రయాణికులకు కావాల్సిన కనీస వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టీకానంద్, గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి



నవతెలంగాణ-వాంకిడి

గ్రామాల్లో సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు తెలుసుకుంటు పరిష్కరించాలని ఎంపీడీఓ వి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంధితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని, పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, అలాగే సానిటేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి ఖాజా అజాజోద్దిన్, ఏపీఓ శ్రావణ్ కుమార్, ఈసీ మొసిస్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని దేవాపూర్ సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న నాగేశ్వర్‌గౌడ్‌ను బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. బాసరకు బదిలీపై వెళ్లగా స్థానిక అటవీశాఖ సిబ్బంది శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ మజారోద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సన్నబియ్యం అందించాలి

నవతెలంగాణ-వాంకిడి

లబ్ధిదారులందరికీ సన్న బియ్యం అందే విధంగా డీలర్లు కృషి చేయాలని తహసీల్దార్ మహమ్మద్ రియాజ్ అలీ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో డీలర్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. గతంలో షాపుల వద్ద నిల్వ ఉంచిన బియ్యాన్ని తనిఖీ చేసి వివరాలను సేకరించామని తెలిపారు. ఆ బియ్యాన్ని తిరిగి గోదాంకు పంపించడం జరుగుతుందని, డీలర్లందరు లబ్ధిదారులకు సన్నబియ్యం అందేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

నవోదయకు అర్హత సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఇటీవల విడుదలైన నవోదయ ఫలితాలలో జిల్లా కేంద్రంలోని హోలీ ట్రినిటీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న వరుణ్ ఎంపిక కాగా పాఠశాల కరస్పాండెంట్ మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుణ్ జిల్లాలోని మిగతా విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచాడని కొనియాడారు. రానున్న రోజుల్లో జిల్లా నుండి మరిన్ని అద్భుతాలు విద్యార్థులు సాధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముషీర్, జయరాజ్, కరణ్, శంకర్ పాల్గొన్నారు.


జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించడం పట్ల హర్షం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జర్నలిస్టుల సమస్యలను సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరిష్ బాబు అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల కాగజ్‌నగర్ ప్రెస్ క్లబ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం అభినందనీయమని ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ టి.సురేందర్ రావు, ప్రధాన కార్యదర్శి తిరుమలాచారి పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడ, రహపల్లి గ్రామపంచాయతీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను మండల అధ్యక్షులు మసాదే చరణ్ భూమి పూజ చేశారు. డీసీసీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు పనులను ప్రారంభించమని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సీహెచ్.వసంత్ రావు, షేక్ కలీం, మాజీ ఎంపీటీసీ మేకర్తి శ్రీనివాస్, శివరాం నాయక్, వినోద్, తిరుపతి, ప్రవీణ్, బాబ్లు, సుధాకర్, బూరుగూడ, రహపల్లి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నీతి అయోగ్ పనులను త్వరగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నీతి అయోగ్ పథకంలో భాగంగా ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో జిల్లాలోని తిర్యాణి బ్లాక్‌లో మంజూరైన పనులను త్వరగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి వైద్య, విద్య సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో ఆస్పిరేషనల్ జిల్లా బ్లాక్ కింద మంజూరైన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పిరేషనల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా బ్లాక్‌లలో అంబులెన్స్ సర్వీస్ కల్పించేందుకు అవసరమైన పరిపాలన అనుమతులు రూపొందించాలని తెలిపారు. 20 గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణానికి అనుమతులు పొందాలన్నారు. అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఆసిఫాబాద్ పట్టణానికి సమీపంలో ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తించాలని, 6 మినీ అంగన్‌వాడీ మోడల్ భవన నిర్మాణాల పనులు త్వరగా చేపట్టాలని, ఎంపిక చేసిన 6 పాఠశాలలలో మరమ్మత్తులు, అదనపు గదుల నిర్మాణాల పనులు చేపట్టాలని తెలిపారు. ఆస్పిరేషనల్ తిర్యాణి బ్లాక్‌లో భాగంగా తిర్యాణి మండలంలో పాఠశాలలు, రైతు వేదికలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో డిజిటల్ ఇంప్రూవ్‌మెంట్‌లో భాగంగా కంప్యూటర్లు, ప్రింటర్లను సమకూర్చాలని, 14 మోడల్ అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి స్థలం, అవసరమైన పరిపాలన అనుమతులు పొందాలని తెలిపారు. మహిళా సమైక్య భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, మండలంలో ఎంపిక చేసిన పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఆస్పిరేషనల్ బ్లాక్‌లో మంజూరైన పనులను త్వరగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి కోటయ్య నాయక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం పాల్గొన్నారు.

సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పాల్వాయి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీలో ప్రస్తావించారు. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ పద్దులపై ఆయన మాట్లాడారు. మా నాన్న మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తం రావు పేరుతో ఉన్న ప్రాజెక్ట్ నిర్వహణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, దీనికి నిధులు కేటాయించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయం అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టేనని, దీని నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. జగన్నాథ్ పూర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేసి దిగువ రైతులకు నీరందించాలని కోరారు. సన్న వడ్లకు బోనస్ ఇచ్చినట్లు ఒక వక్క ప్రభుత్వం చెపుతోందని, కానీ తన నియోజకవర్గంలోని దహెగాం పీఏసీఎస్‌లో 40 శాతం మంది రైతులకు బోనస్ డబ్బులు చెల్లించని పరిస్థితి ఉందని అన్నారు. ఇటీవల వీచిన భారీ గాలులకు నియోజకవర్గంలో పంటలు, ఇండ్లు దెబ్బ తిన్నాయని, వీరికి నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. బెట్టింగ్, సట్ట, మట్కా, దో నెంబర్ దంధాలకు కాగజ్‌నగర్ పెట్టింది పేరని, వీటి నిరోధానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారుల కృషికి తగిన ఫలితం

- మెప్మా రుణాల రికవరీలో అవార్డు సొంతం
- మంత్రిచే అవార్డు తీసుకున్న అదనపు కలెక్టర్



మంత్రి చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విధి నిర్వహణలో కృషి చేస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని మరోసారి జిల్లాలో నిరూపితమైంది. అధికారులు జీతం కోసం కాకుండా చేసే పనిలో నిబద్ధతతో వ్యవహరిస్తే ఎటువంటి విజయం సాధించవచ్చు అని అదనపు కలెక్టర్ దీపక్ తివారి నిరూపించారు. మెప్మా రుణాల రికవరీలో రాష్ట్రంలో మూడో స్థానం సంపాదించి అవార్డు సొంతం చేసుకున్నారు.

జిల్లాలో ఇది పరిస్థితి

మెప్మా ఆర్‌ఎం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలో 2023-24 సంవత్సరానికి రూ.5కోట్ల 28లక్షలు రుణాలు ఇవ్వడానికి లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అధికారులు కృషి చేయడంతో రూ.ఏడు కోట్ల 23 లక్షలు మెప్మా స్త్రీ నిధి రుణాలు 132 శాతం ఇచ్చారు. ప్రస్తుత సంవత్సరం కూడా 94 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు.

రికవరీలో మూడవ స్థానం

రాష్ట్రంలో మెప్మా స్త్రీ నిధి రుణాలు ఇవ్వడంలో రికార్డు సృష్టించగా రికవరీలో కూడా ఆ రికార్డు నిలుపుకుంది. అదనపు కలెక్టర్ దీపక్ తివారి ప్రత్యేకంగా రుణాల రికవరీలో దృష్టి సారించి సిబ్బందితో రుణాలు తీసుకున్న వారు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు తిరిగి చెల్లించే విధంగా చేయడంలో విజయవంతం అయ్యారు.

మంత్రి చేతుల మీదుగా అవార్డు సొంతం

హైదరాబాద్‌ని గచ్చిబౌలిలో బుధవారం నిర్వహించిన స్త్రీ నిధి రుణాల 12వ సర్వసభ్య సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి మంత్రి అవార్డును అందజేశారు. రికవరిలో మూడవ స్థానం సాధించడంతో పాటు సిబ్బంది కృషిని మంత్రి అభినందించారు. వెనుకబడిన జిల్లా లక్ష్యాన్ని సాధించడం ఆదర్శప్రాయం అన్నారు.

ఇది ఎంతో ప్రోత్సాహకంగా పనిచేస్తుంది

మెప్మా స్త్రీనిధి రుణాల రికవరీలో రికార్డు సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందని స్త్రీ నిధి ఆర్‌ఎం శ్రీనివాస్ అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతామన్నారు. వెనకబడిన, ఆదివాసుల జిల్లాలో మంచి ఫలితాలు సాధించడం హర్షణీయమన్నారు.

గ్రామాల్లో పర్యటించిన ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని పాపన్నపేట, గబ్బాయి, తలాయి, కుకుడా గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పర్యటించారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గబ్బాయి గ్రామంలో అటవీశాఖ అధికారులు చెరువు మరమ్మతులకు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆర్ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. పాపన్నపేట గ్రామం 1985లో ఏర్పాటు చేసుకుంటే అటవీ అధికారులు ఇప్పుడు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. తలాయి గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురి శ్యామ్‌రావు, కాశి పాకరాజు, మండల అధ్యక్షుడు భూస సారయ్య, యువజన అధ్యక్షుడు దుర్గం తిరుపతి, నాయకులు మోహన్, కాజా మొయినుద్దీన్, శంషొద్దీన్, రాజలింగు, రౌతులచ్చయ్య, బాబురావు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌ఎస్‌పీ

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతలెంగాణ-జైనూర్

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారినులు పాఠశాల స్థాయి నుంచే బాలికలు, మహిళల కోసం ఉన్న చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. భరోసా టీం ఇన్‌చార్జి ఎస్సై తిరుమల, ఇన్‌చార్జి శిరీష మాట్లాడుతూ ముఖ్యంగా సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థినులు, మహిళలు హింస, ఈవ్‌టీజింగ్‌కి గురైనప్పుడు 8712670564 లేని పక్షంలో డయల్ 100ని సంప్రదించాలన్నారు. ఇందులో పాఠశాల సిబ్బంది, షీ టీం సభ్యులు స్వప్న, శ్రీలత, భరోసా టీం అడ్వకేట్ శైలజ, విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-వాంకిడి

వివాహానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. బుధవారం ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని కోమటిగూడ గ్రామానికి చెందిన కొట్రంగి మహేష్(29) మంగళవారం సమీపంలోని కొత్త దుబ్బగూడ గ్రామంలో బంధువుల పెళ్లికి వెళ్లాడు. రాత్రి 10 గంటలు దాటడంతో మహారాష్ట్రలోని భారి గ్రామానికి చెందిన ముండె మానిక్ రావు ఆటోలో తిరిగి కోమటిగూడలోని తన ఇంటికి వచ్చే క్రమంలో గ్రామ సమీపంలోని రహదారిపై మూలమలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంబానికి వేగంగా ఢీకొట్టాడు. దీంతో మహేష్ తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భయందోళనకు గురైన మానిక్ రావు ఎవరికి తెలుపకుండానే బోల్తా పడ్డ ఆటోను లేపుకుని బారీ గ్రామానికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో స్థానికులు అటుగా వెళ్తుండగా రోడ్డు పక్కన మహేష్ పడి ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలం వద్ద ఆటో నంబర్, పగిలిన అద్దాలు పడి ఉండటంతో రోడ్డు ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన మానిక్ రావును అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్యతో పాటు నాలుగేళ్ల కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి కొట్రంగి ఆనంద్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను పరిశీలించిన తహసీల్దార్



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వం నమూనాగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను తహసీల్దార్ భుమేశ్వర్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం రూ.5 లక్షలతో ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను నిర్మిస్తోందన్నారు. ఇందిరమ్మ మోడల్ హౌసిస్ త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డెప్యూటీ తహసీల్దార్ భీమ్లానాయక్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుతరావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రవి, సిబ్బంది ఉన్నారు.

బ్యాంకుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీనియర్ సిటిజన్‌ల కోసం బ్యాంకులో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని పలువురు సీనియర్ సిటిజన్స్ యూనియన్ నాయకులు కోరారు. బుధవారం ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సతీష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 60 ఏండ్లు దాటిన వారు ఎక్కువ సేపు నిలబడలేరని, శారీరకంగా బలహీనంగా ఉంటారని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సహకరించాలని కోరారు. ఇందులో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మూర్తి సత్యనారాయణ, యూనియన్ బాధ్యులు కలికోట రమణయ్య, యు.నారాయణ, డాక్టర్ లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

ఆర్టీసీ విచారణకు ప్రత్యేక నెంబర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిపో పరిధిలో నడిచే బస్సుల వివరాలు రూట్‌ల వివరాలు తెలుసుకోవడానికి ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక నెంబర్ కేటాయిస్తున్నట్లు డిపో మేనేజర్ కేవీ రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు 9493282510 విచారణ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రయాణించే వారికి సమాచారం తక్షణమే అందుబాటులోకి రానుందన్నారు. రోజూ వందలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఆసిఫాబాద్ డిపోలో ఈ కొత్త విచారణ సౌలభ్యం వినియోగించుకోవాలన్నారు.

రేపు జిల్లాలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రేపు జిల్లాలో పర్యటించనున్నట్లు చైర్మన్ పీఆర్‌ఓ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ గ్రామీణ ప్రాంతంలోని 11 కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా నేడు మండలంలోని గుండి గ్రామపంచాయతీలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆసిఫాబాద్ గ్రామీణ విద్యుత్ శాఖ ఏఈ ఊర్మిళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం స్థలంలో వెలిసిన మైసమ్మ ఆలయ 2వ వార్షికోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం వేదపండితులు సంతోష్ శర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు ప్రహ్లాద్, సురేష్, సతీష్, భక్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
గురువారం | మార్చి 27, 2025 | www.navatelangana.com

మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం.

మండలంలోని దేవునిగూడెం, సింగరాయపేట, చింతాగూడ, కలమడుగు, పొనకల్ క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న మహిళా రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ పనిముట్లు, యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని మహిళా రైతుల కోసం ప్రభుత్వం బ్యాటరీ, మాన్యువల్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్, రొటేటర్ లాంటి పరికరాలను సబ్సిడీపై మంజూరు చేసిందన్నారు. ఆసక్తిగల మహిళా రైతులు మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు, ధరకాస్తుతో పాటు ఫోటో, పట్టా పాస్‌బుక్ జీరాక్స్, డీడీ, ఆధార్ కార్డు జీరాక్స్, బాంక్ పాస్ బుక్ జీరాక్స్, ట్రాక్టర్ పనిముట్లైతే ఆర్‌సీ జాతచేయాలని తెలిపారు. రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్న మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు

కమిటీలో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ, పీసీఆర్, పీఓఏ యాక్ట్-1989 నందు కేటగిరి-ఎఫ్ ఐదుగురు అనధికార సభ్యులు షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు సభ్యత్వానికి కేటగిరి-జిలో ముగ్గురు నాన్ అఫిషియల్ సభ్యులు స్వచ్ఛంద సంస్థలతో సంబంధాన్ని కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీలు కాకుండా ఉన్న జిల్లాకు చెందిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు తాము చేసిన సేవా కార్యక్రమాలతో కూడిన ఆధారాలు పేపర్ క్లిప్పింగ్లు, ఫొటోలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు చేసిన సేవలతో కూడిన ఆధారాలతో ఏప్రిల్-2వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లాలోని నస్పూర్‌లోగల కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, కమిటీలో ఎన్నికైన సభ్యులకు ఎలాంటి పారితోషికం, టీఏ, డీఏలు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

నవతెలంగాణ-తాండూర్

ఖరీఫ్‌కు సమాయాత్తం అవుతున్న రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా చూడాలని బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ తెలిపారు. మండలంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలోకి నకిలీ విత్తనాలు రాకుండా పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు నిఘా ఉంచాలన్నారు. క్రమం తప్పకుండా ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి ఎరువులు పురుగు మందుల నాణ్యతను, స్టాకు వివరాలను తెలుసుకోవాలని సూచించారు. ఫర్టిలైజర్ షాపుల్లో ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు ఎరువులు పురుగు మందులు అమ్మితే లైసెన్సులు రద్దు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. బీటీ-3 విత్తనాలు వాడి గ్లైపోసెట్ పిచికారి చేయడం వల్ల కలిగే అనర్థాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఖరీఫ్‌లో రైతులు మంచి పంట దిగుబడులు సాధించేలా విద్యుత్, ఇరిగేషన్ శాఖ అధికారులు సమాయాత్తం కావాలన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువుల స్థితిగతులను పరిశీలించాలని తెలిపారు. ఆయకట్టుకు నీరందించే తూము మత్తడి చెరువు కట్టల పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే నెల నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ అధికారులు సన్న బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు. రేషన్ డీలర్లు బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ స్టాక్ బోర్డులను స్టాక్ రిజిస్టర్‌లను నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుష్మ, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, డీటీ ప్రసాద్, ఆర్ఐ ఏజాజొద్దీన్ పాల్గొన్నారు



విత్తనాల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీఓ హరికృష్ణ

ప్రజావాణి పంచాయతీ..

ప్రజావాణి పంచాయితీని బుధవారం ఆర్డిఓ హరికష్ణ పరిష్కారం చూపారు. మిట్ట మల్లయ్య బర్ల అంకులు అనే రైతులు నోటి మాట అంగీకారం భూమిని ఒకరికొకరు బదలాయింపు చేసుకున్నారు. అంగీకారం ప్రకారం 20 సంవత్సరాలుగా బదాలయింపు చేసుకున్న భూమిని సాగు చేసుకుంటున్నారు. భూమి రిజిస్ట్రేషన్ విషయంలో వివాదాలు రావటంతో ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ఆర్డీఓ సమక్షంలో ఇరు పక్షాల వాదనలు విని సమస్యకు పరిష్కారం చూపారు.



జైపూర్‌లో..

లక్షెట్టిపేట : రైతులకు వివిధ రాకాల నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ దిలీప్ కుమార్, సీఐ అల్లం నరేందర్, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ హెచ్చరించారు. నకిలీ విత్తనాలను నిరోధించే క్రమంలో బుధవారం మండల టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని విత్తన దుకాణాలను, గోదాములను తనిఖీ చేశారు. దుకాణాలలో నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యమైన విత్తనాలనే రైతులకు అమ్మి రసీదులు తప్పకుండా ఇవ్వాలని సూచించారు.



లక్షెట్టిపేటలో..

జైపూర్ : మండలంలో విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు ప్రభుత్వం అనుమతించిన కంపెనీలకు చెందిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం హెచ్చరించింది. వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్, తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్సై శ్రీధర్‌తో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం ఎరువుల దుకాణాల్లో నిల్వ చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అదేవిధంగా ఎరువుల దుకాణాలకు సంబంధించిన అనుమతి పత్రాలు, క్రయ విక్రయాల గడువు, నిల్వ చేస్తున్న గోదాములు, బిల్లు బుక్కులు పరిశీలించారు. అనుమతి పొందిన విత్తనాలు విక్రయించాలని, వెనువెంటనే రశీదు ఇవ్వాలని సూచించారు. ఎమ్మార్పీ రేటుతో మాత్రమే విక్రయించాలని ఆదేశించిన అధికారులు తెలియని వ్యక్తులకు, చిన్న పిల్లలకు, అనుమానస్పద వ్యక్తులకు పురుగుల మందులు అమ్మకూడదని హెచ్చరించారు. నకిలీ పత్తి విత్తనాలు, గ్లైఫోసెట్ గడ్డి మందు అమ్మినా కొనుగోలు చేసినా నిల్వ ఉంచుకున్నా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

పని స్థలాల్లో నీడ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నందున ఉపాధి హామీ కూలీలు సేద తీరడానికి పని ప్రదేశాల్లో నీడ ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. బుధవారం పెగడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలి గిట్టుబాటు అయ్యే విధంగా నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేయాలని తెలిపారు. వాతావరణం చల్లగా ఉన్నప్పుడే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. పని స్థలాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, కూలీలకు చల్ల నీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ బాలయ్య ఉన్నారు.

హెల్ప్‌డెస్క్‌ను వినయోగించుకోవాలి

గ్రామస్తుల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలని ఎంపీఓ శ్రీపతి బాపురావు సూచించారు. బుధవారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ సందర్శించిన ఆయన ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుల స్థితిగతులు మొబైల్ ఫోన్ ద్వారా ధరఖాస్తుదారులకు సమాచారం అందుతుందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుదారులకు ప్రభుత్వం 25 శాతం రాయితీతో లేఔట్‌లను క్రమబద్ధీకరించనుందని తెలిపారు.

కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-నస్పూర్

కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్, ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ కే రాజేందర్ మంగళవారం రాత్రి ఆర్కే న్యూటెక్ గనిని ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కార్యాలయంలో గని ప్లానులను జనరల్ మేనేజర్లు పరిశీలించి అనంతరం గనిలోనికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీపిల్లరింగ్ జరుగుతున్న గనులలో తీసుకుంటున్న జాగ్రత్త చర్యలను పరిశీలించడంలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని ఉద్యోగులందరూ వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరిస్తూ ఉండాలని అన్నారు. అలాగే పని ప్రదేశాలను ఎల్లవేళలా పరిశీలిస్తూ ఉండాలని, ప్రతిరోజు సేఫ్టీ మేనేజ్మెంట్ ప్రొసీజర్స్ ను పాటిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా రక్షణాధికారి ధర్ రావు, గని మేనేజర్ స్వామి రాజు, గని రక్షణ అధికారి రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షీ టీమ్ అవగాహనా సదస్సు



నవతెలంగాణ-మందమర్రి

శివాని హై స్కూలు విద్యార్థులకు బుధవారం షీ టీమ్ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులు మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడం షీ టీమ్ కర్తవ్యం అని, పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, సమస్య వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుపై తక్షణమే షీ టీమ్ పోలీసులు స్పందించి సంబంధిత విభాగాలకు సమాచారం అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీమ్ బృందాలు సహాయం చేస్తాయని తెలిపారు. వేధింపులకు గురవుతున్న మహిళలు 6303923700 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. అత్యవసర సమయంలో డయల్ 100కి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ మహిళా కానిస్టేబుల్ జ్యోతి, శ్రీలత, పాఠశాల ఇన్‌చార్జి రవీందర్ పాల్గొన్నారు.

నవోదయలో సత్తా చాటిన స్లేట్ ఎక్సలెన్స్ విద్యార్థులు





నవతెలంగాణ-జన్నారం

ఇటీవలే వెలువడిన నవోదయ పరీక్షా ఫలితాల్లో మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన డి.అభిరామ్, డి.విశ్వసాయి, ఆర్ భరద్వాజ్‌లు నవోదయకు ఎంపికైనట్లు స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నవోదయ ఎంపికైన ఆ ముగ్గురు విద్యార్థులను చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు. గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని, వారిని అన్ని రంగాలలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామ్లాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

వృత్తి శిక్షణ తరగతులను సందర్శించిన సేవా అధ్యక్షురాలు స్వరూప



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ తరగతులను సేవా అధ్యక్షురాలు స్వరూప రాణి దేవేందర్ సందర్శించారు. సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ తరగతులు టైలరింగ్, బ్యూటిషన్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్ సెంటర్‌లను సేవ సమితి అధ్యక్షురాలు స్వరూప రాణి దేవేందర్ బుధవారం సందర్శించారు. కంప్యూటర్ డీసీఏ కోర్స్ శిక్షణ ముగించుకున్న అభ్యర్థులకి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం సేవా సమితి ద్వారా మహిళలు, యువతకి ఎన్నో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. శిక్షణ కోర్సులు నేర్చుకుంటున్న మిమ్మల్ని చూస్తే సంతోషంగా ఉందన్నారు. సింగరేణి ముఖ్య ఉద్దేశ్యం మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడి ఎంతో కొంత సంపాదించి కుటుంబాలకు అండగా నిలబడాలని సేవా సమితి ద్వారా ఇలాంటి కోర్సులను ప్రవేశపెడుతుందని తెలిపారు. శిక్షణ సమయంలో కుట్టినవి విక్రయించడానికి హైదరాబాదు శిల్పారామంలో ప్రతి సంవత్సరం ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ స్టాల్స్ నిర్వహిస్తున్నారని కనుక మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు కవిత, మనీ, శిక్షకురాలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

రేపటి మినీ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కాలశాలలో నిర్వహించే మినీ జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అపోలో ఫార్మసీ(100), ఫార్మసిస్ట్(40), ట్రైనీ ఫార్మసిస్ట్(20), ఫార్మసీ అసిస్టెంట్(30), ట్రైనీ అసోసియేట్ (10)లకు మంచిర్యాల, గోదావరిఖని, హైదరాబాద్‌లలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు డీ ఫార్మసీ, బి ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ అర్హత కలిగి ఉండాలని వయసు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అలాగే స్టాఫింగ్ టైటాన్స్ ప్రయివేట్ లిమిటెడ్ హైదరాబాద్ కంపెనీలో(100) హెచ్ఆర్, అసోసియేట్స్, టెలి కాలర్ మంచిర్యాల, హైదరాబాద్‌లలో పనిచేయుటకు ఎస్ఎస్సి, ఏదైనా డిగ్రీ అర్హత కలవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇతరా సమచారానికి 8247656356, 8522903936, 9110368501 మొబైల్ నెంబర్లను సంప్రదించలన్నారు.

క్రికెట్ క్రీడాకారులకు బ్యాట్స్ అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని 6వ వార్డ్‌లోని క్రికెట్ క్రీడాకారులకు లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేష్ బుధవారం క్రికెట్ బ్యాట్స్ అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడాకారులు ఆటలో రాణించి భవిష్యత్తులో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని కోరారు.



పాస్‌పోర్ట్ పోయినది

నేను పురంశెట్టి హరీష్, తండ్రి పురంశెట్టి శంకరయ్య గ్రామం రోటిగూడ, మండలం జన్నారం, జిల్లా మంచిర్యాల. నేను టి6946361 నంబర్ గల పాస్‌పోర్టు కలిగి ఉన్నాను. రోటిగూడ గ్రామం నుంచి బైక్ పై జన్నారం వెళ్తున్నప్పుడు నా యొక్క పాస్‌పోర్ట్ పోయింది. ఎవరికైనా దొరికినచో పై అడ్రస్ లేదా సెల్ నం. : 6302680543, 8309452902 కి సమాచారం అందించగలరు.

కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించకపోవడం సరికాదు



కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా

నవతెలంగాణ-నస్పూర్

ఫిబ్రవరి నెలలోనే 161 శాతం, 119 శాతం రవాణా చేసిన శ్రీరాంపూర్ ఉపరితల గని కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించకపోవడం సరికాదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా అన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలోని అన్ని డిపార్ట్మెంట్ల కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఉపరితల గని నుండే శ్రీరాంపూర్ సీహెచ్‌పీకి బొగ్గు వెళ్తుందని అలాంటి సీహెచ్‌పీ కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించినప్పుడు శ్రీరాంపూర్ ఉపరితల గనిలో పనిచేస్తున్న కార్మికులకు ఇన్సెంటివ్ ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో క్యాంటీన్ నిర్వహణకు టెండర్ సమయం అయిపోయిన టెండర్ పిలవకపోవడం వలన పాత కాంట్రాక్టర్ సరిగా చేయలేకపోతున్నాడని, వెంటనే టెండర్ పిలచి కార్మికులకు నాణ్యమైన, మెనూ ప్రకారం అల్పాహారం అందించాలన్నారు. ఒకవైపు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కార్మికులను పనిగంటలు సద్వినియోగం చేసుకోవాలని చెబుతుంటే కార్మికులు పని స్థలాలకు చేరుకోవడానికి సరిపడా వెహికల్స్ లేవన్నారు. ఓసీ జీఎల్ బంకర్, సీహెచ్‌పీ కార్మికులకు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కోశాధికారి నాగభూషణం, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

సీహెచ్‌పీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలి : సీఐటీయూ

నవతెలంగాణ-మందమర్రి

సీహెచ్‌పీ కార్మికులక మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆర్కేపీ, సీహెచ్‌పీలో పని చేస్తున్న కార్మికులకు వేసవి ఉపశమనం కోసం మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కోరారు. బుధవారం ఎస్ఈ చంద్రమౌళికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డస్ట్ మాస్కులు ఇవ్వాలని, డిసెంబర్ నాటికి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను భర్తీ చేయాలని, ఖాళీలతో సంబంధం లేకుండా షాఫ్లింగ్ మజ్దూర్ ప్రమోషన్లు ఇవ్వాలటి డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్ట్‌లోని సీహెచ్‌పీల వద్ద పనిచేస్తున్న కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చే యాజమాన్యం ఏరియా సీహెచ్‌పీలలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం ఇవ్వడంలో వివక్ష చూపుతున్నారని, గుర్తింపు సంఘం తమ వంతు బాధ్యతగా ఓసీ కార్మికులతో సమానంగా సీహెచ్‌పీ కార్మికులకు ఇప్పించాలని, అవుట్ డోర్‌లో పని చేసే సివిల్, వర్క్ షాప్, సెక్యూరిటీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఇప్పించాలని అన్నారు. గుర్తింపు సంఘం అలసత్వం వల్లనే సెప్టెంబర్ నెలలో ఇవ్వగా మిగిలిన ప్రమోషన్లను మార్చిలో ఇవ్వకుండా అలసత్వం జరుగుతున్న సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ ఆయిందాల శ్రీనివాస్, బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్ పాల్గొన్నారు.



ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐటీయూ నాయకులు

డంపింగ్ యార్డ్ వెంటనే ఎత్తివేయాలి



డంపింగ్ యార్డు వద్ద మాట్లాడుతున్న ఐక్య వేదిక నాయకులు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పాత మున్సిపాలిటీ ఆవరణలోని డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. చెత్త నిర్వహణ సక్రమంగా చేయకపోవడంతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీకి శాశ్వతమైన డంపింగ్ యార్డ్ లేకపోవడంతో చెత్త ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని తెలిపారు. కన్నాల బస్తి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద వ్యర్థాలను తగలబెట్టడంతో పరిసర ప్రాంతాల బస్తీలకు, పొగ దట్టంగా వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. బెల్లంపల్లి పట్టణం నడిబొడ్డున పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 34 వార్డులకు సంబంధించిన వ్యర్థాలను తీసుకొచ్చి డంప్ చేస్తున్నారని తెలిపారు. తడి పొడి చెత్తను పోచమ్మ గడ్డ ఐటీడీఏ ఉద్యానవనం, హిందూ, క్రిస్టియన్, స్మశాన వాటికల పక్కన గ్రామీణ ప్రధాన రహదారి పక్కన వేస్తుండడంతో బెల్లంపల్లికి వచ్చి పోయే ప్రజలు తీవ్రమైన అసౌకర్యానికి గురి అవుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీకి డంపింగ్ యార్డ్ భూమి కేటాయించటం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వెంటనే డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు టి మణి రామ్ సింగ్ ఎండీ చాంద్ పాషా, ఎం పోషమల్లు, రాజన్న పాల్గొన్నారు.

'కంటి సమస్య ఉంటే అద్దాలు వాడాలి'

నవతెలంగాణ-జన్నారం



కంటి సమస్య ఉన్న విద్యార్థులు కంటి అద్దాలను తప్పకుండా వాడాలని ఆర్బీఎస్కే జిల్లా సహాయ అధికారి గౌరీ శంకర్ సూచించారు. బుధవారం జన్నారం మండలంలోని కలమడుగు జడ్పీ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 24 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి, ఆర్బీఎస్కే అధికారులను అభినందించారు. విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పోచయ్య, ఉపాధ్యాయులు రమేష్, రాజేందర్, తిరుపతి, కవిత పాల్గొన్నారు.

వన్యప్రాణులకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో ఉన్న అభయారణ్యంలోని వన్యప్రాణులకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇందనపల్లి ఎస్ఆర్ఓ కారం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని రాయికుంట, బర్తన్ పేట్, తదితర ప్రాంతాల్లో సోలార్ సిస్టంలతో నడిచే బోర్లను ఆయన పరిశీలించారు. అభయారణ్యంలో విద్యుత్ సౌకర్యం ఉండదని, సౌర విద్యుత్తుతో పనిచేసే బోర్లను ఏర్పాటు చేసి నీటి కొరత లేకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు హనుమంతరావు, ముజీపుద్దీన్ పాల్గొన్నారు.

రాజనీతి శాస్త్ర విభాగం ఎక్స్‌టెన్షన్ లెక్చర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఎక్స్‌టెన్షన్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ అధ్యక్షతగా వహించగా ఆసిఫాబాద్ టిజిటీడబ్ల్యుఆర్డీసి అసిస్టెంట్ ప్రొఫెసర్ చైతన్యకుమారి పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి కార్య సాధకుడిగా లక్ష్యం, గమ్యం ఏర్పాటు చేసుకొని పోటీతత్వం పెంచుకొని, నిలకడగా సివిల్స్, గ్రూప్స్‌కు పోటీ పడాలని అన్నారు. పరీక్షలలో పాలిటిక్స్‌కు చాలా ప్రాధాన్యత ఉందని, రాజ్యం, రాజ్యాంగం, చట్టాలు - శాసనాలు, రాజ్యాంగ సవరణల గురించి వివరించారు. గత ప్రశ్నలను విశ్లేషణ చేస్తూ ఎలా మార్కులు సాధించాలో వివరించారు. అనంతరం ఆమెను పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో విభాగం అధిపతి లక్ష్మణ్ పుట్ట, వైస్ ప్రిన్సిపాల్ ముంతాజ్ భేగం, శిరీష, శ్రీలత, భార్గవి, ప్రితం పాటిల్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఖానాపూర్

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..బుధవారం కడెం నుండి తర్లపాడు వైపు వస్తున్న ఆటోలో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారని సమాచారం అందడంతో ఆటోని పట్టుకున్నారు. నాలుగు నుంచి ఐదు క్వింటాల బియ్యం ఉన్నట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఇటీవలే అనారోగ్యంతో మరణించిన నాందేడపు కిషన్ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల మహేష్ , నాందేడపు చిన్ను, పుదారి సాయికృష్ణ, రాఘవేందర్, పిఎ శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, నీగులపు సంజీవ్, అనుముల భాస్కర్ ఉన్నారు.

సేవాలాల్ విగ్రహ ప్రతిష్టాపనకు రూ.10వేల విరాళం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని జువ్విగూడలో ఈ నెల 27న బంజారాల అరధ్య దైవం సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టపనకు మాజీ జడ్పీటీసీ రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మెన్ ఎర్ర చంద్ర శేఖర్ రూ.10 వేల నగదును కమిటీ సభ్యులకు అందజేశారు. అదేవిదంగా పీసీఆర్(పూర్ణ చందర్) పౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రెండు బియ్యం బస్తాలను కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీఆర్ పౌండేషన్ వ్యవస్థపకులు ముడుగు ప్రవీణ్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, పౌండేషన్ సభ్యులు మాజీ ఎంపీటీసీ రాగుల శంకర్, విక్రమ్, బినవేణి గంగన్న యాదవ్, ముద్రకోల రవి పాల్గొన్నారు.

వేసవి పూర్తయ్యే వరకు చలివేంద్రం కొనసాగించాలి



నవతెలంగాణ-జైపూర్

ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రం వేసవికాలం పూర్తయ్యే వరకు కొనసాగించాలని భీమారం ఎంపీడీఓ మదుసూధన్ సూచించారు. భీమారం గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి ఎండలు ముదురుతున్నందున ఉదయం నుండి సాయంత్రం వరకు చల్లటి నీరు అందుబాటులో ఉండాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

ఏఆర్ఎస్ కళాశాలలో జాబ్‌మేళా

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఇషికా కన్సల్టేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్‌లకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 30 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో సెలెక్ట్ అయ్యారు. సెలెక్ట్ అయిన విద్యార్థిని విద్యార్థులక ఏఆర్ఎస్ ప్రిన్సిపాల్ ముత్యం సతీష్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే రోజులలో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్లు కల్పిస్తామన్నారు. కార్యాలక్రమంలో రఘు, వనిత, రాజశేఖర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉద్యోగులు గైర్హాజరు కావడం సరికాదు

నవతెలంగాణ-నస్పూర్

ఉపరితల విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు గైర్హాజరు కావడం సరికాదని డీజీఎం పర్సనల్ అరవిందరావు అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ ఉపరితల గని, జీఎం ఆఫీస్, ఆర్కే-8, నస్పూర్ డిస్పెన్సరీ, సెక్యూరిటీ విభాగాలలో గైర్హాజరు ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అరవిందరావు మాట్లాడుతూ ఉపరితల విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు గైర్హాజరు కావడం చాలా దురదష్టకరమని, శ్రీరాంపూర్ ఏరియాలో 2024 సంవత్సరములో కనీసం వంద మస్టర్లు చేయని ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇప్పటి నుంచి తప్పని సరిగా ప్రతి నెల 20 మస్టర్లు చేయాలని సూచించారు. సంస్థలో ఉద్యోగం దొరకడం మీ అందరి అదృష్టమని ఉద్యోగులందరూ హాజరు శాతాన్ని పెంచుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ చాల సదుపాయాలు అందిస్తుందని ప్రతి ఒక్కరు దానిని దృష్టిలో ఉంచుకొని విదులకు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీవైసీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, డీవైపీఎం రాజేష్, ఎస్ఆర్పీ ఓసీపీ సీనియర్ పీఓ శంకర్, పీఓఏ వెంకటస్వామి, సీనియర్ అసిస్టెంట్ ఆకుల అఖిల పాల్గొన్నారు.



ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

ఎయిడ్స్‌పై వాలంటీర్లకు అవగాహన



అవగాహన కార్యక్రమానికి హాజరైన వాలంటీర్లు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని వివేక వర్ధిని డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం యువజన క్రీడల మంత్రిత్వ శాఖల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుకు కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవ పథకం కోఆర్డినేటర్ నారాయణ హాజరై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి నివారణకు చేపట్టవలసిన చర్యలు, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రతిఒక్కరు ముందుకు రావాలని కోరారు. 2025-26కి గాను యాక్షన్ ప్లాన్‌ని, రెగ్యులర్ యాక్టివిటీస్, స్పెషల్ క్యాంపుకు సంబంధించి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కన్వీనర్ డా చంద్రమోహన్‌గౌడ్ ఉదారి, నిర్మల్ జిల్లా ప్రోగ్రామ్ కన్వీనర్ జి అర్చన, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్, కళాశాల ప్రోగ్రాం అధికారి షరీనా, వివిధ కళాశాల ప్రోగ్రాం అధికారులు మోహన్, కుమార్, మల్లేష్, నర్సింగరావు, పాషా, రవికుమార్, రాజు, ఓంప్రకాశ్, రాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు

- సమ్మెకు సిద్ధమైన ఇందారం ఓపెన్‌కాస్ట్ గని కాంట్రాక్టు కార్మికులు

నవతెలంగాణ-జైపూర్

గడిచిన 18 నెలలుగా చాలి చాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఇందారం ఓపన్‌కాస్ట్ గని కార్మికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇందారం ఓపన్‌కాస్ట్ గని కాంట్రాక్టు కంపెనీ తరాహాలో 2023 అక్టోబర్ నుంచి వోల్వో ఆపరేటర్, చావల్ ఆపరేటర్, సూపర్‌వైజర్, బ్లాస్టింగ్ లేబర్, హెల్పర్లుగా పని చేస్తున్నామని బుధవారం వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా జైపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్రీధర్‌ను కలిసి ముందస్తుగా వరాహ కంపెనీ (జీకేఆర్-జేవీ) యాజమాన్యానికి ఇచ్చిన వినతి పత్రాన్ని అందజేశారు. కాగా జీతభత్యాల పెంపు విషయమై గతంలో పలుమార్లు కంపెనీ మేనేజర్‌ను కలిసి విన్నవించినా ఫలితం లేకపోయిందని వివరించారు. సమస్యలు పరిష్కారించాలని కోరిన సందర్భంగా సదరు కంపెనీ ప్రతినిధులు మార్చి వరకు ఆగాలని కోరినప్పటికీ కంపెనీ నుంచి ఎలాంటి స్పందన లేకుండాపోయిందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ పనుల్లో చేరినప్పటి నుండి వాహనాలు సరిగ్గా లేకపోయినా, రోడ్లు చెడిపోయివున్నా, శ్రమకోర్చి విధులు నిర్వహిస్తున్నా వరాహ కంపెనీ యాజమాన్యం మా ఇబ్బందులను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఎంతో ఓర్పుగా పని చేస్తూ జీతభత్యాలు పెంచి ఆదుకోవాలని కోరిన మా పట్ల వరాహ కంపెనీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కంపెనీ యాజమాన్యం స్పందించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికునికి రూ. 5 వేల చొప్పున జీతాలు పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీఎఫ్ క్లీయరెన్స్ చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల దృష్టితో స్థానికంగా ఆర్ఎంపీ వైద్యున్ని అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఇప్పటికైనా స్పందించాలని లేని పక్షంలో ఈ నెల 29 నుంచి నిరవధిక సమ్మెకు చేపడతామని వినతిపత్రంలో పేర్కొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఉపాధి హామీ కూలీలకు సఖి అవగాహన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న లావణ్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలంలోని మచ్చాపూర్, కొలంగూడ, ముత్నూర్ తాండ, జవహర్ నగర్ గ్రామాల్లో బుధవారం సఖి కేంద్రం మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, సైకో సోషియల్ కౌన్సిలర్ ప్రవీణ- కేస్ వర్కర్, గృహ హింస చట్టం, సఖి కేంద్రం సేవలు, టోల్ ఫ్రీ నెంబర్లు 181, 1098, 1930 గురించి అవగాహన కల్పించారు. డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్, మహిళా సాధికారత, మిషన్ శక్తి పథకం, పని చేసే చోట లైంగిక వేధింపులు, ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన పథకం, ప్రధాన మంత్రి సురక్షా భీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకంపై యశోద అవగాహన కల్పించారు. కార్యక్రమంకో ఫీల్డ్ అసిస్టెంట్స్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

వాడ పోచమ్మకు బోనం మొక్కులు

నవతెలంగాణ-మందమర్రి

వాడ పోచమ్మకు భక్తులు ఒడి బియ్యం సమర్పించి బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్లతో శివ సత్తుల నృత్యాలతో బుధవారం 3వ జోన్‌లోని ముత్యాల పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకొని బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఉగాది ముందు పోచమ్మకు బోనాలు సమర్పించుకోవడం తెలంగాణలో ఆనవాయితీగా వస్తుంది. బుధవారం బోనాలు సమర్పించుకోవడానికి చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చి మట్టి కుండలో నైవేద్యాన్ని వండి అమ్మవారికి సమర్పంచారు. కళ్లు సాక పెట్టి పాడిపంట, పిల్ల పాపలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.



అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో

- కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

నవతెలంగాణ-మందమర్రి



కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై మందమర్రి పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాపల్ ప్రాంతానికి చెందిన ఆకుదారి సతీష్ 15 ఏండ్ల కూతురిపై మంగళవారం రాత్రి కన్నతండ్రియే అసభ్యంగా ప్రవర్తించాడు. అడ్డుకోబోయిన భార్యను చేతులతో కర్రతో కొట్టినట్లు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, మహిళా పోలీస్ అధికారితో బాధితురాలు వాంగ్మూలం నమోదు చేశారు. నిందితుడు ఆటో డ్రైవర్, పశువుల కాపరిని అదుపులోకి తీసుకొని విచారించారు. భార్యతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నట్లు, నిందితుని పెద్ద కూతురు(బాధితురాలు) తనకు పుట్టలేదన్న అనుమానంతో కోపంగా ఉండేవాడు. బుధవారం ఇంట్లో పోచమ్మ చేసుకుందామని బాధితురాలుని మంగళవారం మధ్యాహ్నం హాస్టల్ నుండి తీసుకువచ్చిన తండ్రి బయటకు వెళ్లి మద్యం తాగి వచ్చి కోపంతో కూతురి బట్టలు చింపి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అడ్డుకోబోయిన భార్యను కర్రతో కొట్టాడు. కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితున్ని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం బుధవారం కోర్టులో హాజరు పరిచి, బాధితురాలని కౌన్సెలింగ్ కోసం భరోసా సెంటర్‌కి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్లాసెంటా అండ్ జంతుశాస్త్రం విభాగం ట్రైప్స్ అనే అంశంపై విద్యార్థులకు విస్తృత ఉపన్యాసం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా.జె.సంగీత అధ్యక్షత వహించగా ఉట్నూర్ ప్రభుత్త డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు డా.ముమ్మిడి నర్సింగ్ రావ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంతుశాస్త్రం ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ఆయనను కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి డా.కె.రాజ్ కుమార్, అనిల్, రాజశేఖర్, వెంకటేష్, సలెహ, విదార్థులు పాల్గొన్నారు

ఇంద్రవెల్లి డైలీ మార్కెట్ వేలం రూ.3.25 లక్షలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి వారాంతపు సంత, డైలీ మార్కెట్ వేలం బుధవారం ప్రత్యేకాధికారి భాస్కర్, ఎంపీఓ జీవన్ రెడ్డి, ఈఓ సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. డైలీ మార్కెట్ వేలం ధోలే మంతోష్ రూ. 3.25 లక్షలకు సొంతం చేసుకోగా, వారాంతపు సంత వేలం అనుకున్న ఆదాయం రాక పోవడంతో వాయిదా వేశారు. వారాంతపు సంత వేలం గురువారం నిర్వహిస్తామని ప్రత్యేకాధికారి తెలిపారు.

వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వార్డెన్ చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) ఉమ్మడి జిల్లా నాయకులు కొట్టురి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదర్శ పాఠశాలల్లోని వంట సరుకులను అధికారి భర్త తీసుకెళ్లినట్లు సంబంధిత సిబ్బంది గుర్తించిన నేపథ్యంలో ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బోథ్ నియోజకవర్గ కో కన్వీనర్ సతీష్, రాజు, విజయ్, రామ్ పాల్గొన్నారు.

నవోదయలో నాగభూషణం విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బోథ్

ఇటీవల వెలువడిన నవోదయ ఫలితాల్లో మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థులకు బుధవారం ఎస్సై ప్రవీణ్ విద్యార్థులు జాదవ్ తరుణ్, జాదవ్ శృతిని అభినందించారు. సీట్లు సాధించడం వారిని పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్, ఉపాధ్యాయులున్నారు.

నేడు అవగాహన శిబిరం

నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో గురువారం అవగాహన శిబిరం, ఔట్రిచ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సహాయ పీఎఫ్ కమీషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కార వేదిక, సమాచార మార్పిడి, నెట్‌వర్క్ ఔట్‌రిచ్‌లకు సంబంధించి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, సభ్యులు, కార్మిక సంఘాలు, యాజమాన్య సంఘాలు ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి, సూచనలు తెలుసుకోవడానికి తప్పక హాజరు కావాలని కోరారు.

వ్యక్తిపై న్యూసెన్స్ కేసు నమోదు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన నల్ల మాధవరెడ్డిపై బుధవారం న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పదే పదే డయల్-100కు ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలు డయల్-100కు అత్యవసర సమయాల్లో మాత్రమే ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
ARB. No. 348 OF 2022

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,
Represented by its Divisional Legal Officer, RAMPUR, Branch, V Ramesh S/o Kanakaiah Aged about 33 Years, R/o. Karimangar.
...Disputant

VERSUS

MARUTHI RAJU BANDARU & Others
5. RAMAKRISHNA GOLI, S/o. MARUTHI, aged about 41 years, Occ: M/s. Rama Krishna Tent House Jannaram, R/o. H,NO:4-26, VASAVINAGAR, PONKAL, ADILABAD, TELANGANA.
6. ANJANNA APPALA, S/o. LINGAIAH, aged about 44 years, Occ: M/s. Gentlemen Fashions and Ponkal, R/o. H,NO:4-27/B, VINAYAKNAGAR, PONKAL, ADILABAD, TELANGANA. .... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 10-04-2025 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని బిక్కుతాండకు చెందిన సెడ్మకి చంద్రకాంత్(32) జీవితం పై విరక్తి చెంది ఊరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మృతుడు గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. భార్య మంజుల ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించినప్పటికీ ఫలితం లేకపోవడంతో జీవితం పై విరక్తితో బుధవారం బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నీటి వనరులను సంరక్షించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్

సకల జీవరాసులకు ప్రాణధారమైన నీటిని తక్కువగా వాడుతూ భవిష్యత్ తరాల అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాలవికాస సంస్థ జిల్లా ప్రతినిధి బోయర్ నరేందర్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని సిర్సన్న ఉన్నత పాఠశాలలో బుధవారం బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సరోజాదేవి, సీఆర్పీ వెంకన్న, వీడీసీ అధ్యక్షుడు సురేష్ రెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, భూమారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖలో నేటి నుంచి బయోమెట్రిక్ హాజరు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో గురువారం నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ రాజేందర్ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఆరోగ్య కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరు అమలుపరిచినప్పటికీ సాంకేతిక ఇబ్బందులు, మరమ్మతులతో బయోమెట్రిక్ విధానం కొంతకాలమే కొనసాగిందని పేర్కొన్నారు. వాటన్నింటికి మరమ్మతులు చేయించి, అవసరమైన చోట కొత్త వాటిని బిగించి అన్ని ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయితీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కలెక్టర్ అభిలాష అభినవ్ అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లతో కలిసి పాల్గొన్నారు. వివిధ జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలంతా అన్ని పండుగలను కలిసికట్టుగా సోదరభావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో ఆర్డీఓ రత్న కళ్యాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేయడం అభినందనీయం

- కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-కాసిపేట

యువత రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని ప్రముఖ కల్వరీ చర్చిలో ప్రవీణ్, షారోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి ఫౌండేషన్ సేవలను అభినందించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో రక్తం లభించక తలసీమియా, సికిల్ సెల్ రోగులతో పాటు అనేక మంది ప్రాణాపాయ స్థితిలో ఉంటారని, అలాంటి వేళలో ప్రవీణ్ షారోన్ ఫౌండేషన్లు రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. 2016 నుంచి అనేకసార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించారని తెలిపారు. బెల్లంపల్లి ప్రాంతంలో రక్తహీనతతో బాధపడుతున్న తలసీమియా, సికిల్ సెల్ రోగులకు ప్రాణదాతలుగా నిలిచారని కొనియాడారు. రానున్న రోజుల్లో బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సిస్టర్ షారోన్ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ప్రవీణ్- షారోన్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా పేదల ఆకలి తీర్చేందుకు నిత్య అన్నదాన కార్యక్రమం కూడా ప్రారంభిస్తామన్నారు. 20 సంవత్సరాలుగా నిరుపేదలకు వైద్య శిబిరాలు, నిత్య అన్నదానం, విద్యార్థులకు అవసరమైన వస్తువుల పంపిణీ, బ్లాడ్ క్యాంపులు నిర్వహిస్తూ వచ్చామని వివరించారు. ఇప్పటివరకు వందలాది యూనిట్ల రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అందజేశామన్నారు. బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 83 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీఓ పి.హరికృష్ణ, ఏసీపీ ఏ.రవికుమార్, మాజీ జడ్పీటీసీ కారుకూరి రాంచందర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముత్తినేని రవికుమార్, రెడ్ క్రాస్ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, కాసర్ల రంజిత్, రక్తదాతలు , గ్రామస్తులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకున్న గుర్తింపు సంఘం



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఏఐటీయూసీ నాయకులు కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, మందమర్రి బ్యాంక్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేశ్ల కార్మికులతో కలిసి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బ్యాంక్ షెడ్డు రిపేరు చేయాలని, కార్మికుల రెస్ట్ హాల్ త్వరగా నిర్మించాలని, సరిపడా సేఫ్టీ మెటీరియల్ అందించాలన్నారు. స్నానాలు చేసే వద్ద శుభ్రంగా ఉంచాలని, భోజనాలు చేసే రూం శుభ్రంగా ఉంచాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున సరైన రక్షణ చర్యలు తీసుకొని చల్లటి నీళ్ల ఓఆర్ ప్యాకెట్లు కార్మికులకు ఎండ నుండి తెచ్చుకునే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. గని ఉత్పత్తి ఉత్పాదకత రక్షణ విషయాల్లో కార్మికులు నాయకులు అధికారులు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ చర్చల్లో భాగంగా గని మేనేజర్ భూశంకరయ్య, గ్రూపు ఏజెంట్ రాంబాబుతో మాట్లాడడంతో అధికారులు స్పందిస్తూ సమస్యలను పరిష్కారం కోసం గని భవిష్యత్తు కార్మికుల రక్షణ కోసం వేల కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, ఎస్ నాగేశ్వరరావు, వి రాజేందర్, సురేష్, లింగయ్య, ఆడెపు రవీందర్, అనిల్, సంపత్, రఘురాం, శంకరరావు, శంకరయ్య, జాడి పోచం పాల్గొన్నారు.

జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖకు రాష్ట్రస్థాయి అవార్డులు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థకు 2 రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో బుధవారం స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను, స్త్రీనిధి రుణాల వసూలు 88 శాతం, క్రెడిట్ ప్లాన్ అచీవ్మెంట్ లో 105 శాతం లక్ష్యాలను సాధించి ఉత్తమంగా నిలిచినందుకుగాను రాష్ట్రంలోనే రెండవ స్థానం అవార్డు లభించింది. లోకేశ్వరం మండలం ప్రగతి మండల సమాఖ్యకు ఉత్తమ మండల సమక్యగా రాష్ట్రంలో రెండు స్థానం దక్కింది. కాగా జిల్లాకు వరుసగా నాలుగో ఏడాది అవార్డు లభించింది. ఈ అవార్డులను డీఆర్డీఓ తరపున జిల్లా



సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు సాగర, ఏపీఎం మల్లేష్ రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, చేతుల మీదుగా అందుకున్నారు.

నిబంధనల వ్యతిరేకంగా ప్రకటనలు చేయడం చట్ట విరుద్ధం

నవతెలంగాణ-రెబ్బెన

నిబంధనలకు వ్యతిరేకంగా ఔషధాలపై ప్రకటనలు చేయడం చట్ట విరుద్ధమని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ జి.అశ్విని తెలిపారు. బుధవారం మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు ఉన్న కారిఫోర్డ్ సిరప్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ 1954 చట్టం ప్రకారం మందుల లేబుళ్లు కవర్లపై ప్రకటనలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, కారిఫోర్డ్ సిరప్ పై జ్వరాన్ని తగ్గిస్తుందని ముద్రించారని, ఇలా ముద్రించిన తయారీ సంస్థ తిరుపతి మెడికేర్-హైదరాబాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

అమ్మానాన్నలకు చదువు నేర్పించాలి



నవతెలంగాణ-కాసిపేట

అమ్మా నాన్నలకు చదువు నేర్పించాలని విద్యార్థులకు వయోజన జిల్లా విద్యాధికారి పురుషోత్తం నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ విద్యార్థులతో అమ్మానాన్న చదువుపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలన్న అమ్మానాన్నలను సమాజంలో సగౌరవంగా నిలబెట్టాలన్న వారి ఆత్మగౌరవం కాపాడాలన్న 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు చదువురాని నిరక్షరాసులైన తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పించాలన్నారు. బస్టాండ్, బ్యాంకులలో తల్లిదండ్రులు ఇతరుల మీద ఆధారపడకుండా వారి ఆత్మగౌరవంతో వారి పని వారు చేసుకునేలాగా ప్రోత్సహించాలన్నారు. వయస్సు చదువుకు అడ్డురాదని, చదువు వల్ల లాభాలను తెలియజేశారు. అనంతరం మండల విద్యాధికారి ముక్తవరం వెంకటేశ్వర స్వామి చేతుల మీదగా వయోజన విద్య వాచకాన్ని, పెన్సిల్, రబ్బరు విద్యార్థులకు అందజేశారు. మండల డీఆర్పీ బండ శాంకరి వాచకాన్ని తల్లిదండ్రులకు ఎలా బోధించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వయోజన విద్య డీఆర్పీలు బండ శాంకరి, అశోక్ రావు, సుమన్, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ గోపాల్, జ్యోతి, మాధవి లత, తిరుపతి పాల్గొన్నారు

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-నిర్మల్ టౌన్

పట్టణంలోని ముస్లిం సోదరులకు రంజాన్ ఉపవాసాల సందర్భంగా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అలాగే ముస్లిం సోదరులకు పండుగ సందర్భంగా ముందస్తుగా ఎస్పీ జి.జానకి షర్మిల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలు ఒక నెల పాటు ఉపవాసం ఉండి అల్లాహ్‌ను ప్రార్థిస్తారని, ఇస్లాం అయిదు సూత్రాలలో ఉపవాసం ఒకటని, కుటుంబం, స్నేహితులతో కలసి భోజనం చేస్తారన్నారు. అలా తమ విదులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీస్ అధికారులకు సహకరించినందుకు వారికి ధన్యవాదలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గం అలవర్చుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్

చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గం అలవర్చుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని అవల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 4వ ఆధ్యాత్మిక సత్సంగ్ వార్షికోత్సవ భాగంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్క యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి ఆలోచనలతో ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ప్రమోద్ రెడ్డి, సీనియర్ నాయకులు గంభీర్ ఠాక్రే, మస్కే తేజరావు, అడనేశ్వర్ ఫౌండేషన్ చైర్మన్ యువ నాయకులు సతీష్ పవర్, జి సునీల్, విశాల్ గోడే, సురేష్ పాల్గొన్నారు.